క్లుప్తంగా

కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కోచింగ్ తీసుకొని కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన వారిని శనివారం ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి నల్లగొండ పట్టణంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు స్వామిగౌడ్, హరికృష్ణ, గోపాల్‌రెడ్డి, సంజీవ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దండెంపల్లి గ్రామస్తులు

నల్లగొండ రూరల్: మండలంలోని దండెంపల్లి గ్రామానికి చెందిన మన్నెం ఎల్లయ్య ఈ నెల 13న అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామస్తులు తమ గ్రామ వాట్సాప్ గ్రూప్ సహాయంతో సేకరించిన రూ.30 వేల ఆర్థికసాయాన్ని శనివారం మృతుడి కుమారుడు గోపి ముదిరాజ్‌కు అందజేశారు. మృతుడి భార్య పద్మ నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. కుమారుడు గోపి తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామస్తులు అందించిన సహకారానికి గోపి కృతజ్ఞతలు తెలిపాడు.

ఆలయ కమిటీ నియామకం



జితేందర్, చైర్మన్

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో గల శ్రీపచ్చల పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచనల మేరకు శనివారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా తిరుగుడు జితేందర్, గౌరవ సలహాదారుడిగా బత్తుల సంజీవరెడ్డి, ధర్మకర్తలుగా జాల మాధవి, శనగోని నర్సింహ, పావిరాల సైదులు, మాచర్ల రాము, కొయ్యడ సాయిబాబా, వజ్రోజు రాము నియమితులయ్యారు.

పేరేపల్లిలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని పేరేపల్లి గ్రామంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో మైండ్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లోని వృద్ధులకు వైద్య, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంతటి ఈశ్వర్‌గౌడ్, హెల్ప్ ఏజ్ ఇండియా మండల సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వేణు, డాక్టర్ శ్రీనివాస్, నాగరాజు, రాజు, వెంకటేశం పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికైన నకిరేకల్ వాసి



చంద్రకళ

నకిరేకల్: పట్టణానికి చెందిన పత్తిపరుపు చంద్రకళ టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించింది. ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం లచ్చన్నగూడేనికి పత్తిపరుపు వసంతరావు, ఈశ్వరమ్మ దంపతుల కుమార్తె అయిన చంద్రకళకు 2020లో నకిరేకల్‌కు చెందిన గంగధర్ వినయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. ఆమె ప్రస్తుతం హైదారాబాద్ కూకట్‌పల్లిలో గల డాక్టర్ రెడ్డి లేబరేటరీస్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త వినయ్‌కుమార్ కూడా అక్కడే సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. తన భర్త, అత్తమామలు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు ఆమె తెలపారు.

'ఇన్‌స్పైర్ మనక్'కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం తదితరులు

కనగల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న రాయల వందన, కోరె మమత, 9వ తరగతి చదువుతున్న చిత్రం తాత్విక్ రూపొందించిన ప్రాజెక్టులు 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చిలుమల్ల వెంకట్‌రాంరెడ్డి, గైడ్ ఆరూరి జానయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను వారు అభినందించారు.


గంగోరిగూడెంలో తాగునీటి కష్టాలు

- గ్రామంలోని అన్ని ఇళ్లకు సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- వాటర్ ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

మునుగోడు: మండలంలోని గంగోరిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. గంగోరిగూడెం గ్రామంలో మొత్తం 108 ఇళ్లలో దాదాపు 730 మంది నివాసముంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామంలో నీటి సరఫరా కోసం ఐదేళ్ల క్రితం ట్యాంక్ నిర్మించారు. అంతేకాకుండా ఇంటింటికి పైపులైన్లు వేసి నల్లాలు బిగించారు. అయినప్పటికీ కేవలం 30 నుంచి 40 ఇళ్లకు మాత్రమే నాలుగు, ఐదు బిందెల నీరు మాత్రమే సరఫరా అవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిగిలిన ఇళ్లకు తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్ద డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నట్లు వాపోతున్నారు.

ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో..

గంగోరిగూడెం గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో సింగారం గ్రామంలోని సంపు నుంచి ట్యాంక్‌లోకి నీరు ఎక్కడం లేదని, ప్రత్యేకంగా ఓ మోటారు ఏర్పాటు చేస్తేనే నీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలిసినా కూడా అధికారులు మోటారు ఏర్పాటు చేయకుండా గత నాలుగేళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ పలుమార్లు మిషన్ భగరీథ నీరు రావడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని అంటున్నారు. జిల్లాస్థాయి అధికారులకు సమస్యను విన్నవించడంతో ఒకటి, రెండుసార్లు గ్రామంలో పర్యటించి పరిశీలించినప్పటికీ తాగునీటి సమస్యని పరిష్కరించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు గ్రామమంతా సరఫరా అయ్యేలా చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



గంగోరిగూడెంలో నీరు లేక వృథాగా ఉంటున్న వాటర్ ట్యాంక్

అధికారులు పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో ఇంటింటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు అధికారులు ఐదేళ్ల క్రితం పైపులైన్లు, నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఒక్కరోజు కూడా సరిగా నీరు రావడం లేదు. మా గ్రామం ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో తాగునీరు సరఫరా కావడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించలేదు. కావాలనే అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు.

– పానుగంటి విజయ్‌గౌడ్, గంగోరిగూడెం

ప్రత్యేకంగా సంపు ఏర్పాటు చేశాం

గంగోరిగూడెంలో ఎత్తైన ప్రదేశంలో తాగునీరు సరఫరా చేసే ట్యాంక్ కట్టడంతో అందులోకి నీరు ఎక్కడం లేదు. దీంతో గ్రామంలోని చిన్న ట్యాంక్‌కు కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తున్నాం. పెద్ద ట్యాంక్‌లోకి నీరు ఎక్కించేందుకు గ్రామ సమీపంలో ప్రత్యేకంగా సంపు నిర్మించాం. సంపులో మోటారు ఏర్పాటు చేసి నీరు ఎక్కిస్తాం. నాలుగైదు రోజుల్లో ప్రతి ఇంటికి నీరు సరఫరా చేస్తాం.

– అజయ్, మిషన్ భగీరథ ఏఈ

అనుమతి లేకుండానే స్కూళ్లకు సెలవు

- చెర్వుగట్టు జాతర నేపథ్యంలో లోకల్ హాలిడే ప్రకటించిన పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలు అనుమతి లేకుండానే స్కూళ్లకు శనివారం లోకల్ హాలిడే ప్రకటించుకున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు జాతర సందర్భంగా సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ప్రతి విద్యా సంవత్సరంలో జూన్ నుంచి ఏప్రిల్ వరకు ప్రతి పాఠశాలకు మూడు లోకల్ హాలిడేస్ ఉంటాయి. వాస్తవానికి స్థానిక పండుగలు, జాతరలకు లోకల్ హాలిడేను ప్రకటించుకోవాల్సి ఉంటుంది. లేదా సమీప దూరంలో పండుగలు, జాతరలకు ఉన్నతాధికారుల అనుమతితో హాలిడేను ప్రకటించుకోవచ్చు. ఇవేమీ పట్టని తిప్పర్తి, వెంకటాద్రిపాలెం, వడ్డెరగూడెం, జొన్నలగడ్డగూడెం, నూకలవారిగూడెం, సైదబాయిగూడెం, మర్రిగూడెం, మల్లేపల్లివారిగూడెం ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు శనివారం లోకల్ హాలిడేను ప్రకటించుకున్నారు.

తిప్పర్తికి చెర్వుగట్టు చాలా దూరం..

తిప్పర్తి మండలంలోని కొన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెర్వుగట్టు జాతర సందర్భంగా పాఠశాలలకు శనివారం లోకల్ హాలిడేను ఇస్తున్నట్లు సంబంధిత ఎంఈఓకు తెలియజేశారు. తిప్పర్తి మండల పాఠశాలలకు చెర్వుగట్టు చాలా దూరం ఉండడం ఒకటైతే, ప్రతి నెల మూడవ శనివారం పాఠశాలల్లో పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఆ రోజున సెలవు ఇవ్వడానికి ఎవరికీ అనుమతి ఉండదు. అయినప్పటికీ గతంలో మాదిరిగా లోకల్ హాలిడే ఇచ్చారు. అయితే కొన్ని పాఠశాలల్లో హాలిడే ఇస్తున్నట్లు విద్యార్థులకు సమాచారం కూడా ఇవ్వలేదు. దీంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై డీఈఓ భిక్షపతిని వివరణ కోరగా సెలవులు ప్రకటించిన సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి వివరణ కోరినట్లు తెలిపారు.



తిప్పర్తి ప్రాథమిక పాఠశాల గేటుకు తాళం వేసిన దృశ్యం

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు

తిప్పర్తి మండలంలోని పాఠశాలలకు శనివారం లోకల్ హాలిడే ఇవ్వడానికి అనుమతి ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం లోకల్ హాలిడే పెట్టుకోవడానికి అనుమతి లేదు. అంతేకాకుండా పాఠశాలలో పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ విషయం డీఈఓ తెలియజేశాను.

– కె. అరుంధతి, ఎంఈఓ

బస్సు యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ పాపారావు

నకిరేకల్: ఈ నెల 20న నకిరేకల్‌కు రానున్న బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ పొనుగోటి పాపారావు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, నాయకులు గుండగోని భరత్, రూపాని లింగస్వామి, నకిరేకంటి మొగిలయ్య, అయిత గోని అనిత, పల్స శ్రీనుగౌడ్, గోలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

నల్లగొండ: పట్టణంలోని నేస్తం సొసైటీ కార్యాలయంలో శనివారం హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు పుల్లారావు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవీ బాధితులకు నేస్తం సొసైటీ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ హర్ష, గౌతమ్‌రెడ్డి, నేస్తం సొసైటీ అధ్యక్షుడు కె. వెంకన్న, జనరల్ సెక్రటరీ చామంతి, స్వాతి, మధు, లెనిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాలకు చెందిన 1985–86 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ శనివారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్, ఆవుల జానయ్య, కోయగూర సన్ని, సప్పిడి మోహన్‌రెడ్డి, ఏదుళ్ల ప్రభాకర్‌రెడ్డి, పోట్లపల్లి వెంకన్న పాల్గొన్నారు.

కులగణన తీర్మానం పట్ల హర్షం

చిట్యాల: రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపడతామని అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణలో శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చిట్యాల మండలం తాళ్ల వెల్లెంల గ్రామ మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్ తదితరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట శ్రీశైలంయాదవ్, బాలరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు'

కనగల్: అసెంబ్లీలో కుల గణన తీర్మాణాన్ని ప్రవేశపెట్టి ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ సమాజం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగంటి నాగరాజు అన్నారు. శనివారం కనగల్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపడతానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర మంత్రులకు కృతజ్ఞతుల తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

మర్రిగూడ: మండలంలోని వట్టిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎనుగుల వెంకట్‌రెడ్డి–జయమ్మ, జాల వెంకటయ్య–కలమ్మ, చామకూర భిక్షమయ్య–మంజుల దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ, ఆలయ చైర్మన్ సిరసవాడ భిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు మలిగిరెడ్డి నర్సిరెడ్డి, కోశాధికారి ఎడ్ల కాశయ్య, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, సత్తయ్య, ముత్యాలు,గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన తీర్మాన ఆమోదం హర్షణీయం

నల్లగొండటౌన్: రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందడం హర్షణీయమని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుల గణన తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు పాసోజు విశ్వనాథం, కోశాధికారి నల్ల సోమలన్న, సీనియర్ ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు కాశయ్యగౌడ్, పసుపులేటి సీతారాములు, నిమ్మనబోటి కృష్ణయ్య, యువజన సంఘం అధ్యక్షుడు చొల్లేటి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు



నల్లగొండ టూటౌన్: కేక్ కట్ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్) జన్మదిన వేడుకలను శనివారం నల్లగొండ పట్టణంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, కనగల్ జెడ్పీటీసీ చెట్ల వెంకటేశం, గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, యామ దయాకర్, హరికృష్ణ, స్వామిగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చీర పంకజ్‌యాదవ్, సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, మాలె శరణ్యారెడ్డి, బక్క పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..

నల్లగొండ రూరల్: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం బీఆర్‌ఎస్‌వీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి మండలంలో..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలో శనివారం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లోడంగి గోవర్ధన్, తండు నర్సింహాగౌడ్, వనపర్తి నాగేశ్వరరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కందుల రేణుక, ఊట్కూరి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కనగల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అంతకుముందు దర్వేశిపురం ఆలయంలో కేసీఆర్ పేరిట అర్చనలు, అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో...

మునుగోడు: కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మునుగోడులో భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల సతీష్ కుమార్, ఏరుకొండ శ్రీనివాస్, జీడిమెట్ల జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: మండల కేంద్రంలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్‌లో..

నకిరేకల్: పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నకిరేకల్, కట్టంగూర్ మండలాల జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, గోధుమగడ్డ జలంధర్‌రెడ్డి, గోపగోని నర్సింహాగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దకాపర్తిలో మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పోట్లపల్లి చిన్నస్వామి తదితరులు కేక్ కట్ చేశారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద శనివారం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నూక సత్తయ్య, మామిడి సర్వయ్య తదితరులున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టుకు నీరు విడుదల చేయాలి

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరేందుకు గాను నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీ నదిలోకి నీటి విడుదల చేయాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతు నాయకుడు చామల వెంకటరమణారెడ్డి జిల్లా నీటిపారుదలశాఖ అధికారులను కోరారు. మూసీ నదిపై వలిగొండ మండలం నెమలికాల్వ వద్ద ఉన్న ఆనకట్టను రైతులు, నీరుపారుదలశాఖ ఏఈ రాములుతో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నెమలికల్వ ఆనకట్ట నుంచి ఆసిఫ్‌నహర్ కాలువకు మూసీ నది వరద నీటిని మళ్లించడంతో శాలిగౌరారం ప్రాజెక్టు హెడ్‌రెగ్యులేటర్ నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితిని ఫోన్‌లో ఆయన నల్లగొండ జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ సుందర్ దృష్టికి తీసుకెళ్లారు. శాలిగౌరారం ప్రాజెక్టులో నీటి నిల్వ సరిపడా లేక ఆయకట్టు చివరి భూములకు సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. నల్లగొండ నీటి పారుదలశాఖ ఈఈ సుందర్ నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీనదిలోకి నీటిని విడుదల చేసేందుకు అంగీకరించడంతో వెంకటరమణారెడ్డి, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి కొనసాగించాలి

చండూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరుతూ ఆర్డీఓ దామోదర్ రావుకు శనివారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మాణ పనులను నిలిపివేశారని, రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కోమటి వీరేశం, పందుల సత్యంగౌడ్, తడకమల్ల శ్రీధర్, పిన్నింటి నరేందర్ రెడ్డి, పెసర్ల హరీష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రామలింగం, చెరుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

కట్టంగూర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశరావు, ఎంఈఓ మేక నాగయ్యతో కలిసి శనివారం ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొండ శంకర్, ప్రధాన కార్యదర్శి సముద్రాల నారాయణ, గౌరవ అధ్యక్షుడు గుండగోని వీరుగౌడ్, కందుల లాజరస్, అశోక్, అనంతుల వెంకటేశ్వర్లు, అబ్బగోని రాజేందర్ తదితరులు ఉన్నారు.

స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మర్రిగూడ: మండలంలోని సరంపేటలో గల స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శనివారం ఆరాధన, 18వ తేదీన పరమపదోత్సవం, 19న అంకురార్పణ, 20న ఉదయం హోమం, ధ్వజారోహణం, రాత్రి కల్యాణోత్సవం, 21న బలిహరణం, 22న ప్రాస రౌపాసన, 23న హోమం, 24న స్వామివారి రథోత్సవం, 25న ధూపోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు మారెపల్లి వెంకటాచార్యులు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



చిట్యాల: ఏపూరులో ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



కనగల్: కురంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



చండూరు: బంగారిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో..



చండూరు: గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి పాఠశాలలో..



శాలిగౌరారం జెడ్పీహెచ్‌ఎస్‌లో..



చండూరు: గాంధీజీ పాఠశాలలో..



కట్టంగూర్: బొల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో..



కేతేపల్లి: కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో..



వెలిమినేడులోని విజయవాణి విద్యానికేతన్‌లో..



కట్టంగూర్: చెర్వుఅన్నారం ప్రాథమిక పాఠశాలలో..